# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాజధాని అమరావతి నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

2. **'మొంథా' తుఫాను కారణంగా తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**

3. **చేనేత కార్మికులకు ఏడాదికి 25 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల మంత్రి  నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ రోజు నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ 'జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.**

==========================

రాజధాని అమరావతి నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై గుంటూరు జిల్లా ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో ఆయన నిన్న సమీక్షించారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆ మేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. నిర్మాణాల్లో వేగంతో పాటు.. నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తానని ముఖ్యమంత్రి చెప్పారు.

--------------------------

'మొంథా' తుఫాను కారణంగా తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో వర్షాలపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. వర్షాల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయలు, ఇళ్లు నీట మునిగితే 15 వేల రూపాయలు, పంట నష్టానికి ఎకరాకు 10 వేలు రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

..వాయిస్...32  సెకన్లు

--------------------------

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ రోజు నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ 'జన్ జాతీయ గౌరవ్ వర్ష్ పక్వాడా' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ నెల 15వ తేదీన బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

---------------------------

గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో ఈరోజు నుంచి ఈనెల 15వ తేదీ వరకు "భారత్ పర్వ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు పాల్గొంటున్నాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించే చేనేత హస్త కళలు, వంటలు తదితర అంశాలపై స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 15వ తేదీన బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం వరకూ జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

---------------------------

మగ్గాలు మీద చేనేత వస్త్రాలు తయారు చేసే కార్మికులకు ఏడాదికి 25 వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తుపాను ప్రభావిత చేనేత కుటుంబాలకు 50 కేజీల బియ్యం, ఆరు రకాల నిత్యావసర వస్తువులను మంత్రి నిన్న పంపిణీ చేశారు. 50 ఏళ్ళకే చేనేత కార్మికులకు ప్రతి నెలా 4వేల రూపాయల పింఛనును కూటమి ప్రభుత్వ అదిస్తుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్.. 29 సెకన్లు

---------------------------

ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలోని నెట్ వర్క్ ఆసుపత్రులకు బకాయిలు మరో 250 కోట్ల రూపాయల చెల్లింపునకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆసుప్రత్రుల యాజమాన్యంతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న సమావేశమై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బకాయిలు నవంబర్ చివరికల్లా మొత్తం ఒకే విడతలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుపై మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడంతో 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకంలో భాగంగా వైద్య సేవల పునరుద్ధరణకు యాజమాన్యాలు అంగీకరించాయి.

---------------------------

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రజలు దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ఏకతాటిపై నడవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సర్దార్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని నిన్న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశానికి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాల్లో సర్దార్ 150 పేరుతో సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రజాప్రతినిధులు,

అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యతా పరుగును నిర్వహించారు.

---------------------------

ప్రముఖ తెలుగు కవి, రచయిత, అనువాదకులు.. దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి ఈరోజు, తెలుగు భావ కవితా రంగంలో... కృష్ణశాస్త్రి ఒక ముఖ్య అధ్యాయం, తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురంలోని రావువారి చంద్రపాలెం గ్రామంలో 1897 నవంబరు 1వ తేదీన జన్మించారు. 1918లో విజయనగరంలో డిగ్రీ పూర్తి చేసి... పెద్దాపురం మిషన్ హైస్కూలులో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. అంతేకాక ఆయన బ్రహ్మసమాజంలో చురుగ్గా పాల్గొనేవారు. 1945లో ఆకాశవాణిలో చేరి అనేక పాటలు, నాటికలు రచించారు. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... మల్లీశ్వరి చిత్రంతో సినీరంగంలో అడుగుపెట్టారు. 1980 ఫిబ్రవరి 24న ఆయన తుదిశ్వాస విడిచారు.

---------------------------

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. సచివాలయంలో గనుల శాఖ ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు నాటికి ఒక వెయ్యి 617 కోట్ల రూపాయల ఆదాయం ఆర్జన లక్ష్యంగా పెట్టుకోగా, 1 వెయ్యి 584 కోట్ల రూపాయల ఆదాయం సాధించినట్లు తెలిపారు. చిన్నతరహా ఖనిజాల నుంచి ఒక వెయ్యి 180 కోట్ల రూపాయల ఆదాయం ఆర్జించినట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ,

వాయిస్ 19 సెకన్లు

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

మొంథా తుఫానుతో నీట మునిగిన పంటలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై ఉన్నతాధికారులతో ఆయన నిన్న శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి 24 గంటల్లో మొత్తం నీటిని మళ్లించాలని స్పష్టం చేశారు.

====================